# "వేశ్యను గాను

కవికొండల

"నా జీవితపు నాద - మే జీవనము సేయు;
ఈపరద చిం చేతు నా? - ఆవరద ముం చేతు నా?
నా జీవితపు నాద - మే జీవనము సేయు;
ఈమదిర పంచేతు నా? - ఆయుదధి వంచేతు నా?"

అని పాట తేలించి వదుల్తూవుంటే ప్రక్కగది లోంచి "కనోజినీ!" అనే హడలేసే గొంతు వినిపించింది. కనోజిని "నేను వేశ్యనుగాను సినీమానటిని." అని హాల్లో వున్న మనిషి లేచి వీథిగుమ్మం దరియబోయింది. "నేను వేశ్యనుగాను సినీమానటిని" అని కనోజిని అన్నమాట కు త్రిప్పుడై యివలకు వస్తూ ముజఫర్ జంగు ఖడ్గందూసి "ఆగు! ఎక్కడికి వెడతావు? ఇదిగో మర్గయా" అని విదళించేడు.

ఆ విదళింపున కాఖడ్గం చటాల్న కంఠంముడి తప్పి ఆస్త్రీయొక్క సిగముడిలోని పూలగుత్తి యొక్క రేకుల్ని తగిలి వాయి మడతడి వూరుకుంది. దానివాయి ఎంత మెత్తందోగదా! అదే కనోజిని కుత్తుక్కు తగిలి వుంటే నిజంగా నెత్తురువట్టయి సింహద్వారపు పరదా మీదికి చిమ్మి చావడిలోని ఎల్ల వస్తువులను ఎఱ్ఱపఱిచి యుండేది. దైవానుగ్రహంవల్ల అది ఆమెకుత్తుక్కు తగల్లేదు. ఆమె తొడిగిన, బొత్తాంలెడసిన నునుజినుగు 'కుర్తా' లోని అపూర్వ సౌందర్యలహరినే ప్రచలిత ప్రతిబింబమాత్రమై ఆమె కానాడు ప్రాణం దక్కించింది.

"కనోజినీ! ఇలా చూడు!" అన్నాడు ముజఫర్ జంగు. "ఆఘుర్కి, జుంకా, టక్రాయి, ఘూరి, అవన్ని అక్కడపెట్టి మఱీవెళ్లు—ఖుషీగా వుండలేక! ఖుషీగా వుండలేక!"———

కనోజినికి ఏడుపు వచ్చేసింది. ఆగాడు;చూచాడు. "ఎందు కలా మేలిముసుగు ముఖమ్మీదికి తీసుకు వెక్కి వెక్కి ఏడుస్తావు? ఎందు కేడుస్తావు?" అని అడిగాడు వినమ్రుడై తన చేతుల్లోకి కనోజిన్ని తీసికొంటూ—అంత వఱకూ కసాయివానికంటె అతిక్రూరంగా కావడ్డ— ఆ ముజఫర్.

ఆలా వినమ్రుడై అతగాడు ఆవొళ్లోకి తీసికోవడ మనేది మోహాలాలనగా, వొళ్లంతా శృంగారరసమయమై పోయింది ఆమెకు. ఏడ్పల్లా మొలకనవ్వుకింద మాఱింది. మొలకనవ్వల్లా అరవిరిన వ్వయింది. అరవిరి నవ్వల్లా అతివిస్పష్టమైన "హాహాహా" నవ్వైంది. ముజఫర్ జంగుమెడకు ఆసాగసి తన లేలేత బాహువల్లరి గుదేసి, అడుగుతూంది నవ్వుతూనే. "నీక్రాస్ ముజఫర్! ఆలా చెదిరివుందేం ఈరోజున?" అని అడిగింది.

ముజఫర్ అన్నాడు "సముద్రపుగాలి యీసాయంత్రం విపరీతంగా వీచింది. అది కారణ మైయుం



# సినీ మానటిని"

వేంకటరావు

టుంది" అని. "ఆఁ! సముద్రపుగాలి! అయితే అది నీకు విపరీతసౌందర్యం తీసుకొచ్చింది." అని పిల్ల మెల్లగా తన మోవి పైకెత్తి ముజఫర్ మోవిని ముద్దెట్టుకుంది. ముద్దెట్టుకుంటూనే అడిగింది: "ముజఫర్! ముజఫర్! నీముద్దు ఈరోజున ఉప్పగా ఉందేం! ఉప్పగా ఉందేం?" అని. ముజఫర్ తన పెదవి తుడుచుకుంటూ "ఈ సాయంకాలం సముద్రంలో నా కో శంఖం దొరికింది. దాన్ని అలాచూస్తూ అప్రయత్నంగా ముగ మానించాగాబోలు. దాని సముద్రపుచెమ్మ మిగిలివుండబోలు-" అన్నాడు. "ఆఁ! సముద్ర శంఖం! అయితే అది నాకు విపరీత కంఠధ్వని తీసికొనివచ్చింది! ఆహా! ఏమి కంఠం నీది! ముజఫర్! ఏమి కంఠం!" అని దిగ్గనలేచి ముజఫర్ను విడిచి, వెళ్లి గదిలో వెతకసాగింది. ముజఫర్ హాల్లోంచే "దేనికోసం ఆ వెదకులాట? శంఖం కోసమా? లేదు! లేదు! ఆ శంఖాన్ని అక్కడే అప్పుడే ఆ సముద్రంలోకే గిరాటేశాను. నాతో తీసికొని రాలేదు." అన్నాడు. ఆ మాటకు గిరుక్కున తిరిగింది కనోజిని. గిరుక్కున తిరిగి అంది: "ముజఫర్! ఆ శంఖాన్ని వొక్కమాటు ముద్దెట్టుకు తిరిగి సముద్రంలోకి గిరాటేశినట్టే, నన్ను కూడా వొక్కమాటు ముద్దెట్టుకు ఎందుకు తిరిగి వదిలి పెట్టేశావు కాదు! ముజఫర్! నన్నెందుకు తిరిగి వదిలి పెట్టేశావు కాదు? ముజఫర్!"——ముజఫర్ అంటాడు వెనక్కలా కుర్చీలో జేర్లాబడి: "ప్యారీ! నిన్ను లోకానికి కనబర్చకుండా అతినిగూఢంగా తీసికొని వచ్చినవాణ్ణి—లోకానికి వదుల్తానా? ప్యారీ! నీవు నా నూర్జహానివి! నీవు నా మమ్‌టాజివి! నీవు నా పిరాజివి! రా! రా! నా చేతుల్లోకి రా! నా కౌగిల్లోపడు! నన్ను పరవశుణ్ణి చెయ్యి" అన్నాడు.



ముజఫర్ జంగు ఖడ్గందూసి "ఆగు! ఎక్కడికి కెడతావు? ఇదిగో మర్గయా" అని విదళించేడు.

ఆలా ముజఫర్ ఆహ్వానిస్తూవుంటే కనోజిని గదిలో తన సామాను సర్దుకుంటూ వుంది, మగనితో చెప్పకుండా ఎక్కడికో ప్రయాణమై వెళ్లిపొయ్యే పెంకెపిల్లలాగు. ముజఫర్ గది తలుపు ఇవల గొళ్లెం వేసినాడు. "తలుపు తియ్యవ్?" అంది లోపట్నుంచి కనోజిని. "తియ్యను. తియ్యను సరిగదా తాళంవేసి పోతున్నా!" అన్నాడు ముజఫర్. అన్నాడేగాని ముజఫర్ తలుపు బార్లా తీసి పారేశాడు. కనోజిని ఆ గదిలోనుంచి పరుపూ, పెట్టె ఎత్తుకుని హాల్లోకి వచ్చి వీధిగుమ్మంకేసి నడుస్తూవుంది. "ఆగు! ఆఘుర్కీ, జుంకా, టర్రయి, ఘూరి, అవన్నీ అక్కడపెట్టి మరీ వెళ్లు" అన్నాడు ముజఫర్. కనోజిని ఆగి చూచింది. అదివఱకులా అతడు కత్తిదూయలేదాతడవ. ఆ తెలిపిని అంది ఆపె: "ఏం! ఈ ఘుర్కీ, జుంకా, టర్రయి, ఘూరీ పెట్టుకు వెళ్లి

పోతే నేమి?" అని అడిగింది. ముజఫర్ "ఒక మహమ్మదీయ స్త్రీ—నా భార్య—లేచిపోతూవుంది అని అనుకొంటుంది లోకం!" అన్నాడు. "ఉం! లోకం అనుకొంటుందీ? ఏమనుకొంటుంది? ఒక మహమ్మదీయ స్త్రీ నీ భార్య లేచిపోతూవుంది అని అనుకొంటుందీ లోకం? నన్ను నీవు తీసికొనివచ్చినప్పు డనుకోలేదు - నీతో వొక మహమ్మదీయస్త్రీ లేచివచ్చిందని ? లోకం అనుకోలేదు?" అని అడిగింది కనోజిని.

ముజఫర్ ఇలాఅని సిద్ధాంతీకరించేడు. "నా భార్య ఆమె - నాప్యారీ ఆమె అని చెప్పాను. ఆలాగే లోకం నమ్మింది." అన్నాడు ముజఫర్.

కనోజిని కళ్లుమూసుకొని జ్ఞాపకం చేసికొంటూ వుంది. తాను తొల్త అతగాడితో చేసివచ్చిన ప్రయాణ మార్గంఅంతా చీకటి కనుమగుండాలా గనిపించింది. రంగూన్‌నుంచి మదరాసు వోడమీద ప్రయాణంచేసింది కాని సముద్రం చూడలే దామె. ఓడచాపలు దించీ ఎత్తీ చప్పుడు విందికాని సముద్రపుగాలి మూచూడలే దామె. అదీ ఆమెసింహావలోకనం! ఆమెకు తెలిసిన దంతే!

ఆమెను దప్పించి లోకానికి తెలిసింది యోజింతాం—కనోజిని భోగంపిల్ల, పందొమ్మిదేళ్లు వయస్సు. ఊరులేని డొంకమల్లెలా గలముకొని, పేరులేని చిన్ని పువ్వులా తలపుకువచ్చే అసలైన అందం, చందం, ఆనందమూను దాంది. దానిచాయ పసినిమ్మపండు చాయ! సోసులో సువాసన! సువాసనలో సోసు! పాడిందా అంటే వీణతంతే దానిగొంతు క్కింకా వీసం లొక్కు.

ఆనాడు హాల్లో "నాజీవితపునాద మేజీవితమొసేయు" నన్నపదం కూనరాగంతో ఎత్తినప్పటి కలరుతము ముజఫర్ జం గొక్కడికసహ్యామై పోయింది కాని, తదితరలోకాని కంతకూ అతిమనోహరమై మాఱుమ్రోగింది. అటువంటి మంజులస్వనం దాంది. ఆమెయొయ్యారం అమృతపుపార్లే! గోళ్లను గోరింటెట్టి నిలబడివుంటే "ఈప్రభాతాన్ని అరుణద్వారం ఓచిన్నదానా! నీవేనా తెఱచినదానవు?" అని పలకరించబుద్ధేస్తుంది ప్రతీమానిసికీ. ఆమె కన్ను లలా మిన్నుకెత్తి మన్నుకు దించుతూ వుంటే అనురాగస్రవంతి నాకాశానికి ఎగతోడి క్రిందకు దిగతోడుతోందే అని మనంకూడా అనుకరించేస్తాం ఆవోడు చెప్పటికప్పుడు,—"అహో! ఈస్త్రీ యేవీరుని పెన్నిధి, ఏధీరునిభావాంబుధి, ఏమగవాని కేడుగడ, ఏ పురుషున కెత్తుగడ" అని ప్రతీవాడూ ఆమెదైన చెంగుచెలిమి అలవరుచుకోవడానికి ప్రయత్నించవలసిందే.

పిల్ల భోగంపిల్లకావడంచేత అందఱికీ అందుబాటులో వుండేటట్టుకూడా అగపించేది. అగపించేది అని ఎందుకు వ్రాస్తూవున్నానంటే ఆమె పయట కొండల మీది మేఘంలా మనలను లొక్కునేదే కాని మనకు చిక్కేదికాదు కాబట్టి. ఈ విచిత్రప్రవృత్తి యితర భోగంపిల్లల కందఱికీ వుంటుందా, వుండదా అనేది మన కిక్కడ అప్రస్తుతం. వాళ్లల్లో లేక యీామెకే వుంటే 'అధికస్య అధికం ఫలం.'

ముజఫర్ అంటూవున్నాడు సింహావలోకన సోయగంలో వున్న కనోజిన్ని ఓరకంట చూస్తూ: "కనోజినీ! నీ వీదాకా తెరచాటుపిల్లవై పరదా వెనుకాల వుంటూ వుండడంచేతనే నీ కా మార్దవం, మధురార్ద్రి స్వభావం, ఆ పచ్చనిమిసిమి, ఆయేపూ నిల్చివున్నాయి. లేకపోతే కగ్గిపోయి, కమిలిపోయి, అగ్గిబుగ్గి లాగైయుందువు" అన్నాడు. కనోజిని "ఎండలోపెట్టి చూడు మొక్కని, కుండకిందపెట్టి చూడు మొక్కని!" అని చుఱుక్కున అంటించింది తన వాడి పల్కు. ముజఫర్ "మొక్కకూ మనకూ తేడావుంది. మనం మనుష్యులం. మొక్క మనిషికాదు. మనం పరదా చాటున ఉండవలసిందే. నడువు, గదిలోకి నడువు." అన్నాడు. కనోజిని "నడవకపోతే నన్ను తంతావా? నన్ను చంపుతావా?" అంది. "మళ్లా మాట్లాడితే అంతపనీ జరుగుతుంది"అని యింటితలుపు లన్నీ వేయించివేసి "చూడు! కనోజినీ! నాకు కావాలీఅంటే ఒక్రేసుమీద ఒక్రేసు ఫెర్రోకాంక్రీటు స్తంభాలమీద నిలిపించి,

నీ న్నెంతపైకైనా పోనిస్తాను. కాని గుమ్మందాటి అవతల కొక్క అడుగైనా పెట్టనివ్వను. దర్వాజాలన్నింటి దగ్గఱా విచ్చు కత్తుల పహారావాళ్లను వుంచేస్తున్నాను. ఫిరంగు లిటూ అటూ వేటకుక్కల్లా వుంటాయి. జాగ్రత్త! నన్ను తెలిసికో!" అన్నాడు ముజఫర్.



తనజుత్తులోనుంచి బా కీవలకుతీసి ఆ బీరెండ కాంతిలో ముజఫర్ను ఎదురురొమ్మున కసుక్కున గ్రుచ్చింది

కనోజని కుక్కిన పేనుమల్లే అయిపోయింది. నేల రాచిన నల్లిలాగ, గోడనంటిపెట్టుకున్న బల్లిలాగ అయిపోయింది. వేసంగిలో ఎండిపోయిన నడదారి గడ్డిలా అణగారిపోయింది. అయినా గొంతు చావలే. "ప్రేసు మీద ప్రేసుకట్టి?" అని అడిగింది. "ప్రేసుమీద ప్రేసుకట్టి, చుట్టూ పరదాలతో మూసి, నీ యిష్టం వచ్చినట్లా కాశంకేసి చూడుమంటా!" అన్నాడు ముజఫర్. "ఊ" అంది కనోజిని. అని వూరుకుంది. ఆనిస్వనము, ఆనిస్వనమువెంబణ్ణె ఆ నిశ్శబ్దం, మనుగడకు ఊత అయిందీ తెలియలేదు: మనుగడకు కోత అయిందీ తెలియలేదు.

మూడురోజులలా కడచన్నాయి. ప్రేసు మీద ప్రేసు లేవనెత్తి, అన్న ప్రకారం ముజఫర్, చుట్టూ పరదాలు కట్టించేడు. ఆ పరదాలనడుమ ఆ ఆకాశంకేసి "అంతా నీదే స్వేచ్ఛ" అన్నట్టు ఆమెను మసలనిచ్చేడు.

నాలుగోరోజున మట్టమధ్యాహ్నం ముజఫర్ చేత కనోజిని బాగా మదిర తాగించేసింది, అల్లిబొల్లి కబుర్లు చెబుతూ — ముజఫరుకు బాగా కైపెక్కిపోయింది. ఆమె తన వస్తువులన్నీ ఊడ్చి పారవేసింది క్రిందిగదిలో. ఒక పచ్చలపిడితో వున్న చక్కని చిన్ని బాకు సిగముడిలో కనబడీకనబడనట్టు గ్రుచ్చుకుంది. వలగ్నానైనా వస్త్రంలేనిదై ఎండలో దిగంబరాకాశంక్రింద పై ప్రేసు మీద పరదాలనడుమ ఒకఅవయవపు నీడ మఱోఅవయవానికి కళాపోషక్కు పెడుతూవుంటే, నగ్ననృత్యం చేస్తూ సూర్యభగవాను నారాధిస్తూవుంది.

ఆనృత్యానికి దిగువహాల్లోని యూయలగొలుసులు కదిలిన ట్లయినయి. గొలుసుల చిరుగంటలు

ప్రోగినట్లయినయి. ముజఫర్‌కు తెలివివచ్చి ఒడలు జలదరించిపోయింది. పైకి పరుగెత్తి "ఇక్కడున్నావా? కనోజినీ!" అన్నాడు. "అవును! వున్నాను! నే నిప్పుడెలావున్నాను! ఏమతస్థురాలినిగా అగపిస్తూవున్నాను" అని అడిగింది. ముజఫర్ ఆమె నలా తిలకిస్తూ "మతం గితం జాంతానై! నీవు నాపాలిటి మహా భోగపదార్థంగా తోస్తూవున్నావు."

"ఛీ! ఛండాలా! అదే అనవద్దన్నాను. నేను వేశ్యనుగాను, సినీమానటిని అని ఇప్పటికైనా తెలుసుకో" అని తనజుత్తులోనుంచి బాకీవలకుతీసి ఆబీరెండకాంతిలో ముజఫర్ ఎదుఱ్ఱొమ్మున కసుక్కున గ్రుచ్చింది. కనోజిని కళ్లల్లోకి బుస్సునకొట్టింది చిమ్మట కొట్టినట్టు వాని ఉడుకునెత్తురు. పచ్చలపిడిబంటీ కనోజినిబాకు ముజఫర్ యొక్క గుండెకండ చవిచూచింది.

ఆమెచూపు కట్టడిపోయింది వొక నిమేషం. ఆమెచెవులు గళ్లడిపోయినాయి వోక్షణికం.

ఆ తాత్కాలికాంధస్సులో, ఆ తాత్కాలిక బధిరతలో కనోజిని అన్న ఆ పిల్ల మానసికంగా ఏం చేస్తూవుంది. స్వచ్ఛందమైన సముద్రపుగాలిలో నిలువునా ఉఱ్ఱూతలూగుతూ ఆనందంగా చిందమూత్తూ వుంది! చిందమూత్తూ వుంది!

